సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 17 । జూన్ । 2025



అదను దాటుతోంది

సాగులో అదను దాటితే దిగుబడులపై ప్రభావం చూపుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వివరాలు 8లో ▸



డ్రగ్స్ మహమ్మారిని తరిమేద్దాం

సమాజం నుంచి డ్రగ్స్ పెనుభూతాన్ని తరిమికొట్టేందుకు హుస్నాబాద్ డ్రగ్స్ నిర్మూలన జేఏసీ పలు కార్యక్రమాలు చేపడుతోంది. వివరాలు 8లో ▸



అంతరాయం లేని విద్యుత్

పటాన్‌చెరు నియోజకవర్గంలో రూ. 11 కోట్లతో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గూడెం తెలిపారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

అతిథి టీచర్ పోస్టులకు దరఖాస్తులు

మునిపల్లి(అందోల్): మునిపల్లి మోడల్ స్కూల్‌లో 6,7,8 తరగతులకు సంబంధించి సబ్జెక్టులు బోధించేందుకు అతిథి టీచర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మల్లిక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్‌బీటీ ప్రతిపాదికన బోధించేందుకు అర్హత కలిగిన బీ.ఏ, బీఈడీ అభ్యర్థులు ఇంగ్లిష్ మీడియంలో బోధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 19వ తేదీ వరకు మునిపల్లి మోడల్ స్కూల్‌లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి 9,253 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 5,483 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలుర విభాగంలో 4,371 మంది విద్యార్థులకుగాను 2,222 మంది ఉత్తీర్ణ సాధించగా, బాలికల విభాగంలో 4,882 మంది విద్యార్థులకుగాను 3,261 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరంలో 4,895 మంది విద్యార్థులకు గాను 2,153 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో బాలుర విభాగంలో 2,804 మంది విద్యార్థులకుగాను 1,171 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికల విభాగంలో 2,091 మంది విద్యార్థినులకుగాను 982 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 675 మంది విద్యార్థులకుగాను 432 మంది సాధించగా, ద్వితీయ సంవత్సరం విభాగంలో 396 మంది విద్యార్థులకుగాను 226 మంది ఉత్తీర్ణత సాధించారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

వట్‌పల్లి(అందోల్): స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో ప్రవేశాలకు బాలబాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి గోవింద్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో ఉన్న స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు గతేడాది గుర్తింపు పొందిన అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోని 3వ తరగతి పూర్తిచేసిన బాలబాలికలు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను మంగళవారం సాయంత్రం 4గంటలలోగా వట్‌పల్లి మండల వనరుల కేంద్రంలో సమర్పించాలన్నారు.

'ఫార్మా' పరిశోధనలో మృణాళిని దేవికి డాక్టరేట్



పటాన్‌చెరు: ఫార్మాస్యూటికల్ పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసిన పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థి మృణాళిని దేవిని డాక్టరేట్ వరించింది. అల్జీమర్స్ వ్యాధి నివారణలో యాంటీ–యాంజియోజెనిక్ చర్యను ప్రేరేపించే ఫైటోకెమికల్ మాడ్యులేషన్‌పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ మేరకు మృణాళినికి మార్గదర్శనం వహిస్తున్న ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శివకుమార్ సోమవారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

వివిధ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్



సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్న వివిధ కార్మిక సంఘాల నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో సోమవారం జరిగిన కార్మిక సంఘాల ముఖ్య నాయకుల సమావేశంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ప్రసాద్, బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు శివశంకర్ పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె పిలుపునిచ్చారు. ఈ సమ్మెలో జిల్లాలో కార్మికులు రైతులు ప్రజలు పెద్ద పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేలా ప్రదర్శనలు ,నిరసనలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు రాజేందర్ రెడ్డి, సుందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆశల సాగుకు అడుగులు

విత్తనాలు విత్తే పనుల్లో రైతులు

- వర్షాలతో పులకించిన రైతాంగం
- ముమ్మరంగా కంది, పెసర, మినుము, పత్తి నాట్లు
- రైతులు, కూలీల బిజీ బిజీ



నారాయణఖేడ్: పత్తినాట్లు వేస్తున్న కూలీలు

నారాయణఖేడ్/ జహీరాబాద్ టౌన్: జిల్లాలో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. మృగశిర కార్తె ప్రవేశించాక వర్షాలు కురుస్తుండటంతో రైతులు పంటసాగు పనులకు ఉపక్రమిస్తున్నారు. ఈ ఏడాది రోహిణి కార్తెలోనే భారీగా వర్షాలు కురిశాయి. కానీ, వ్యవసాయ అధికారులు మృగశిర కార్తె ప్రవేశించాక భూమి తడిసిన తర్వాతనే రైతులు విత్తనాలు విత్తుకోవాలంటూ సూచనలు చేశారు. కొందరు రైతులు రోహిణిలో పత్తి విత్తనాలు వేసినా తర్వాత కార్తె చివరన ఎండలు కాయడంతో అక్కడక్కడా కొన్ని మొలకలు ఎండిపోయాయి. కాగా, వాటి స్థానంలో తిరిగి రైతులు విత్తుకుంటున్నారు. గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో ఎటుచూసినా రైతులు పొలం పనుల్లో బిజీబిజీ అయ్యారు. గ్రామాల్లో కూలీలకు సైతం చేతినిండా పని లభిస్తోంది.

సిద్ధంగా విత్తనాలు..

రైతులు సాగు పనులు సన్నద్ధమవుతుండటంతో వ్యవసాయ శాఖ రైతులకు విత్తనాలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసింది. జిల్లాలో కంది 3,393 క్వింటాళ్లు, పెసర 593, మినుము 391, సోయాబీన్ 23,749, మొక్కజొన్న 639, జొన్న 33, వరి 41,293 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. యూరియా 41,900 మెట్రిక్ టన్నులు, డీఏపీ 14,045, ఎంవోపీ 19,682 మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచారు. కాగా, జిల్లాలో 2,98,718.22హెక్టార్లలో అన్ని రకాల పంటలను రైతులు సాగుచేయనున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో ప్రధానంగా పత్తి 1,43,817.81 హెక్టార్లలో, రెండో ప్రధాన పంటగా వరి 59,424.7 హెక్టార్లలో, కంది పంట 32,044.53 హెక్టార్లు సాగు అయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. హార్టికల్చర్ పంటలు 9898.79హెక్టార్లలో సాగు కానున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో పత్తి విత్తడంతోపాటు కంది, పెసర, మినుము విత్తనాలు విత్తే పనులు జోరుగా సాగుతున్నాయి. కొందరు రైతులు వరి తుకాలు సైతం వేస్తున్నారు. ఇక జహీరాబాద్ వ్యవసాయశాఖ డివిజన్‌లో జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో కూడా సాగు పనులు జోరుగా సాగుతున్నాయి.

34.5మి.మీ వర్షపాతం



ట్రాక్టర్ సహాయంతో విత్తనాలు విత్తుతున్న రైతు

జిల్లాలో మృగశిర కార్తె నుంచి ఊహించిన మేరనే వర్షాలు కురిశాయి. ఈనెల ప్రారంభం నుంచి ఇప్పటివరకు జిల్లా మొత్తంలో సగటున 35.5మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ నెల 8న మృగశిర కార్తె ప్రవేశించగా 9న 7.9మి.మీ, 10న 10.3మి.మీ, 11న 5.4, 12న 3.0, 13న 3.1మి.మీ వర్షపాతం కురిసింది. మే నెలలో 24.0మి.మీ వర్షపాతం మాత్రమే కురియాల్సి ఉండగా 145.1మి.మీ వర్షపాతం నమోదైంది. జూన్‌లో ఇప్పటివరకు 46.1మి.మీ కురియాల్సి ఉండగా 35.5మి.మీ వర్షం కురిసింది. భూమి బాగా తడవటంతో రైతులు వ్యవసాయ పనులు చేపడుతున్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్త



ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నాం. విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్త వహించాలి. నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. విడి విత్తనాలను కొనవద్దు. అమ్ముతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలి.

–భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్



ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రావీణ్య, ఇతర ఉన్నతాధికారులు.

ప్రజావాణి

సంగారెడ్డి జోన్: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రామాలనుంచి ప్రజలు వచ్చి దరఖాస్తులు సమర్పించారు. కలెక్టర్ ప్రావీణ్య, ఇతర అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మొత్తంగా 63 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అధికంగా 15 దరఖాస్తులు రెవెన్యూకు సంబంధించినవి కాగా, 10 దరఖాస్తులు సంక్షేమ పథకాలకు సంబంధించినవి ఉన్నాయని వారు తెలిపారు.

ఉద్యోగమిప్పించండి..



ఫొటోలోని వ్యక్తి న్యాల్‌కల్ మండలం చినిగెపల్లి గ్రామానికి చెందిన రమేశ్. పుట్టుకతోనే దివ్యాంగుడు. తల్లిదండ్రులు కూడా వృద్ధాప్యంతో పనిచేసుకోలేని పరిస్థితుల్లో ఉన్నారు. ఏదో ఒక శాఖలో తనకు అటెండర్ ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు.

నేరుగా సమాచారమివ్వాలి

కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి జోన్: జిల్లాలో తలెత్తే సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు వెంటనే తనకు నేరుగా ఫోన్ ద్వారా, వాట్సాప్ కాల్ ద్వారా సమాచారం అందించాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ శాఖల పూర్తి సమాచారం ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్న ఫైల్స్‌ను పంపాలని జిల్లా అధికారులకు సూచించారు. త్వరలో శాఖల వారీగా సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షకు అధికారులు పూర్తి సమాచారంతో నివేదికలు తయారు చేయాలని సూచించారు. అధికారులు తమ వద్ద ఫైలు పెండింగ్ లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, పద్మజారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్ పోస్టర్ ఆవిష్కరణ

తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ హైదరాబాద్ వారు హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ లో రీజినల్ స్పోర్ట్స్ స్కూళ్లలో ఉన్న తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్స్‌లో 4వ తరగతిలో ప్రవేశాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను జిల్లా అధికారులతో కలిసి విడుదల చేశారు.

కుట్రపూరితంగానే కేటీఆర్‌పై కేసులు

ప్రభుత్వంపై ఎమ్మెల్యే మాణిక్‌రావు ధ్వజం



హరీశ్‌రావును కలిసిన మాణిక్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు

జహీరాబాద్/నారాయణఖేడ్: పరిపాలనలో విఫలమైన కాంగ్రెస్ పార్టీ కావాలనే కుట్రపూరితంగా ప్రతిపక్ష నేతలను తప్పుడు కేసుల్లో ఇరికించి విచారణ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎమ్మెల్యే మాణిక్‌రావు మండి పడ్డారు. బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు మద్దతుగా ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్‌లు బీఆర్‌ఎస్ నేతలతో కలిసి సోమవారం తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు వారు పార్టీ శ్రేణులతో కలిసి తెలంగాణ భవన్‌కు వెళ్లి హరీశ్‌రావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయకులతో కలసి మాణిక్ రావు మాట్లాడారు. ఈ ఫార్ములా కేసులో కేటీఆర్‌కు మళ్లీ ఏసీబీ నోటీసులు ఇవ్వడాన్ని వారు ఖండించారు. కార్యక్రమంలో ఆయా మండలాల పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, సంజీవరెడ్డి, వెంకటేశం, రవీందర్, మాజీ జెడ్పీటీసీ స్వప్న భాస్కర్, పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, బీఆర్‌ఎస్ నాయకులు బండి మోహన్, మొహియొద్దీన్, నర్సింహాగౌడ్, గోపాల్, అమిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు మద్దతుగా తరలిన నాయకులు

కేటీఆర్ సోమవారం ఫార్ములా ఈ–రేస్ కేసులో విచారణకు హాజరైన నేపథ్యంలో ఆయనకు మద్దతుగా ఖేడ్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్దసంఖ్యలో హైదరాబాద్‌కు తరలివెళ్లాయి. కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఖేడ్ నుంచి బయల్దేరిన మాజీ జెడ్పీటీసీ రవీందర్ నాయక్ తదితరులు విమర్శించారు. కాళేశ్వరం విషయంలో ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో ఇబ్బందులను గురిచేయడానికే ఫార్ములా ఈ–రేస్ కేసును తిరిగి తెరపై తెచ్చారని ఆరోపిస్తూ కేటీఆర్‌కు అనుకూలంగా నినాదాలిచ్చారు.

రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి

ఎంపీ ఎం.రఘునందన్‌రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పటాన్‌చెరు నియోజకవర్గంలోని రైల్వే సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ ఎం.రఘునందన్‌రావు పేర్కొన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఈదులనాగులపల్లిలోని రైల్వే క్రాసింగ్ వద్ద రైల్వే గేట్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గత కొన్ని నెలలుగా రైల్వే గేట్‌ను మూసివేయడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ సమస్యను గ్రామస్తులు తన దృష్టికి తీసుకుని రావడంతో విషయాన్ని కేంద్ర రైల్వే శాఖమంత్రి దృష్టికి తీసుకుపోయి సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఈదులనాగులపల్లిలో రైల్వే టెర్మినల్‌ను అభివృద్ధి చేసే విధంగా తన వంతు కృషి చేస్తాని హామీ ఇచ్చారు.



రైల్వే గేట్‌ను ప్రారంభిస్తున్న రఘునందన్

పాఠశాలలు అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

జిన్నారం (పటాన్‌చెరు): కార్పొరేట్ పరిశ్రమల సహకారంతో ప్రణాళిక బద్ధంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని శివనగర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పరిశ్రమ ప్రతినిధులతో కలిసి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...న్యూ ల్యాండ్ పరిశ్రమ సహకారంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.50 లక్షలతో పనులు ప్రారంభించారన్నారు. వీటితోపాటు అదనపు అంతస్తులు నిర్మించేందుకు రూ.కోటి కేటాయించేందుకు న్యూ ల్యాండ్ పరిశ్రమ యాజమాన్యం అంగీకరించిందని ఎమ్మెల్యే తెలిపారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసి గదులను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అధునాతన విద్యా సౌకర్యాలను కల్పించే ఉద్దేశంతో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, పరిశ్రమ ప్రతినిధులు డీవీ రెడ్డిరాజు, మాజీ ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు రాజు, మహేశ్, ఆకుల నవీన్, భార్గవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

18 నాటికి దోస్త్ 3వ విడత రిజిస్ట్రేషన్లు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ ద్వారా మొదటి సంవత్సరం బీఏ,బీకాం, బీఎస్సీ, బీబీఏ వంటి కోర్సులలో ప్రవేశం పొందేందుకు దోస్త్ మూడవ విడత కౌన్సెలింగ్‌లకు ఈ నెల 18 నాటికి రిజిస్ట్రేషన్ చేసుకుని 19న వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని ప్రిన్సిపాల్ బి.భారతి సోమవారం తెలిపారు. జూన్ 23న సీట్లు కేటాయింపు, జూలై 8న సెల్ఫ్ రిపోర్ట్ చేయాలని ఆమె పేర్కొన్నారు. సంబంధిత సర్టిఫికెట్లు తీసుకుని కళాశాలకు వస్తే రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు.

చిరుత కోసం ట్రాప్ కెమెరాలు

- జీబీపేట పరిసరాల్లో ఏర్పాటు చేసిన అధికారులు
- పిల్లలతో కలిసి తిరుగుతోంది: గ్రామస్తులు
- తిరిగింది అడవి పిల్లి.. చిరుతలు కూడా ఉన్నాయి: డీఎఫ్ఓ



అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరా

నారాయణఖేడ్: చిరుత పులి సంచారం ఘటనల నేపథ్యంలో కల్హేర్ మండలం బీబీపేట గ్రామ పరిసరాల్లో అటవీశాఖ అధికారులు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. రెండు రోజుల క్రితం శనివారం ఉదయం కల్హేర్ మాజీ జెడ్పీటీసీ గుండు స్వప్న మోహన్ ఇంటి కాంపౌండ్ వాల్‌లోకి చిరుతపులి సంచరించిన సీసీ టీవీ ఫుటేజీలను గుర్తించి ఆందోళనకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఇంట్లో బిక్కుబిక్కుమంటూ ఉండగా గ్రామస్తులు పొగ్గై చప్పుళ్లు చేయడంతో చిరుత ఇంటి వెనుక వైపు నుంచి పారి పోయింది. విషయం తెలుసుకున్న మెదక్ జిల్లా అటవీశాఖ అధికారి (డీఎఫ్ఓ) శ్రీధర్‌రావు ఘటనా స్థలిని పరిశీలించారు. ఈ నేపథ్యంలో గుండు స్వప్న మోహన్ ఇంటి పరిసరాలతోపాటు అటవీ ప్రాంతాన్ని కలుపుకుని మొత్తం 8 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. సదరు చిరుత గ్రామం నుంచి గ్రామ శివారులోని కిలోమీటర్ దూరం గల వాగు వరకు వెళ్లిన పాద ముద్రలను గ్రామస్తులు గుర్తించి అధికారులకు చూపించారు. బీబీపేట, పోచాపూర్, మార్డండ శివారు ప్రాంతాల్లో చిరుత సంచరిస్తుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు నాలుగు పిల్లలు కూడా ఉన్నట్లు పేర్కొంటున్నారు. వాగు ప్రాంతంలో చెట్లతోపాటు, ఈతవనాలు దట్టంగా ఉండటంతో ఆ ప్రాంతంలో ఆవాసం చేసుకున్నట్లు తెలిపారు.



వాగు ప్రాంతంలో చిరుతపులిగా అనుమానిస్తున్న పాదముద్రలు

అడవి పిల్లి!

బీబీపేటలోని గుండు స్వప్న మోహన్ ఇంటి పరిసరాల్లో తచ్చాడింది చిరుత పులి కాదని అడవి పిల్లి (జెంగిల్ క్యాట్)గా గుర్తించామని డీఎఫ్ఓ శ్రీధర్‌రావు 'సాక్షి'తో మాట్లాడుతూ తెలిపారు. గుర్తులను, తచ్చాడిన వీడియో ఫుటేజీని నిపుణులకు పంపించి పరిశీలించినట్లు చెప్పారు. జంగిల్ క్యాట్ అడుగు గుర్తులు, కలర్, మచ్చలు, సైజు దాదాపు చిరుతను పోలి ఉంటుందని, కానీ చిరుత కాదని స్పష్టం చేశారు. అటవీ ప్రాంతంలో చిరుత పులుల సంచారం కూడా ఉందని చెప్పారు. రెండు రోజులు పెట్రోలింగ్ చేశామని తెలిపారు.

కేజీబీవీల్లో ఇక కొత్త రుచులు

మారిన మెనూ

- విద్యార్థులకు నెలలో రెండుసార్లు మటన్, ఐదుసార్లు గుడ్లు



రాయికోడ్‌లోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులు

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామీణ ప్రాంతాలకు చెందిన అనేకమంది నిరుపేద విద్యార్థులకు కస్తూర్బా గాంధీ విద్యాలయాలు ఆసరాగా నిలుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వీటి బలోపేతానికి చర్యలు తీసుకుంటూనే ఉంది. కస్తూర్బాల్లో విద్యను అభ్యసించే బాలికల ఆరోగ్యంపై నిర్వహించిన సర్వేలో విద్యార్థినులు పౌష్టికాహారలోపంతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తేలింది. దీంతో బాలికలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేజీబీవీలలో మెస్‌చార్జీలు పెంచి విద్యార్థుల ఆహార మెనూలో మార్పులు చేసింది. దీంతో విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం ఆహారం అందజేస్తున్నారు.

ఒక్కో విద్యార్థికి నెలకు రూ.1,740

కస్తూర్బాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు నూతన ఆహార మెనూ ప్రకారం ఒక్కో విద్యార్థికి నెలకు రూ. 1,740 ఖర్చు చేస్తుంది. కేజీబీవీల్లో నూతన మెనూను అమలు చేసేందేకు ఇటీవలే హైదరాబాద్‌లో వంట కార్మికులకు శిక్షణ సైతం ఇచ్చారు. అధికారులు తరచూ పర్యవేక్షణ చేస్తే మాత్రమే మెనూ అమలు పక్కాగా జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఇదీ మెనూ...

ప్రస్తుతం అమలులోకి వచ్చిన కొత్త మెనూ ప్రకారం వారంలో ఉదయం పూట టమాట కిచిడీ, సాంబారు, రాగిజావ, బూస్టు, పూరి, ఉప్మా, పులిహోర, బోండా, వడ, చపాతి, జీరా రైస్, అరటిపండు అందజేయాలి. మధ్యాహ్నం టమాటా పప్పుతో కూడిన అన్నం, నెయ్యి, రసం, పెరుగు, ఉడకబెట్టిన గుడ్లు, చికెన్, సాయంత్రం ఉడకబెట్టిన శెనగలు, కోడిగుడ్డు బజ్జీ, బెల్లం పల్లీలు, అల్లం చాయ్, మిల్లెట్ బిస్కెట్లు, పకోడి ఇవ్వాలి. రాత్రికి వివిధ రకాల కూరలతో తయారు చేసిన అన్నం, సాంబారు, మజ్జిగ వడ్డించాల్సి ఉంటుంది. దీనికి తోడు నెలలో రెండు సార్లు మటన్, అయిదుసార్లు గుడ్లు, ప్రతీ రోజు నెయ్యి అందించాల్సి ఉంటుంది.

కొత్త మెనూ ప్రకారమే

విద్యా సంవత్సరం ప్రారంభం నాటి నుంచే గురుకుల పాఠశాలలో అమలు చేస్తున్న కామన్ మెనూను మన కేజీబీవీలలో కూడా అమలు చేస్తున్నాం. కొత్త మెనూను పకడ్బందీగా అమలు చేయాలని ఇదివరకే ఎస్ఓలకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశాం. కొత్తగా అందించే ఆహార పట్టికను ప్రదర్శనకు ఉంచాలని సూచించాం.

–సుప్రియ, జీసీడీఓ, సంగారెడ్డి

క్లుప్తంగా

మల్లన్న ఆలయంలో వేలం పాట

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం ఆలయానికి సంబంధించి ఈ టెండర్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలంను ఆలయ ఈఓ అన్నపూర్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. మల్లన్న సమావేశ మందిరంలో తదితర వాటిపై లైసెన్సు హక్కును పొందేందుకు వేలం నిర్వహించారు. కొబ్బరి ముక్కలు సేకరించేందుకు లైసెన్సు హక్కును కురవికి చెందిన యుగేందర్ రూ.71,77,777కు, వస్త్రాలు, ఒడి బియ్యం, పసుపు సేకరించే హక్కును కొమురవెల్లికి చెందిన ఉప్పల వంశీకృష్ణ రూ.70,56,000కు దక్కించుకున్నారు. కోరమీసాలు, మొక్కుబడి వస్త్రాల విక్రయించే హక్కును ఎక్కాల దేవి అరుణ రూ.16,61,000లకు దక్కించుకోగా, టాయిలెట్స్ నిర్వహణ హక్కును మిత్రా ఎంటర్‌ప్రైజెస్ రూ.4,71,000లకు దక్కించుకున్నారు. ఆలయానికి పాలు పెరుగు సరఫరా చేసే హక్కును కడెం సిద్దులు, ఆలయంలో వీడియో, ఫొటోలు తీసే లైసెన్సు హక్కును మల్లం నవీన్ దక్కించుకున్నారు. అలాగే ఆలయంలో కొబ్బరి కాయల విక్రయం, ఎల్లమ్మ ఆలయం వద్ద కూల్‌డ్రింక్స్, పూల సరఫరా, బుక్స్ ప్రింటింగ్ కోసం నిర్వహించిన వేలంలో సరైన ధర రాకపోవడంతో వాటిని వాయిదా వేస్తున్నట్లు ఆలయ ఈఓ పేర్కొన్నారు.

ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు



దళిత కుటుంబానికి న్యాయం చేయాలని వినతి పత్రం అందిస్తున్న శంకర్

చేగుంట(తూప్రాన్): మండలంలోని పొలంపల్లిలో దళితుడు సత్యనారాయణ వ్యవసాయ భూమిలో అక్రమంగా నిర్మించిన సెల్ టవర్‌ను తొలగించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ఫిర్యాదు చేసినట్లు దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్ కార్యాలయంలో దళితుడి భూమి ఆక్రమణతో పాటు సెల్‌టవర్ అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. బాధిత కటుంబీకులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. చైర్మన్‌ను కలిసిన వారిలో దళిత సంఘాల నాయకులు అశోక్, స్వామి, సంజీవ్ తదితరులు ఉన్నారు.

మహిళ అదృశ్యం



పద్మ

నర్సాపూర్ రూరల్: మహిళ అదృశ్యమైన ఘటన నర్సాపూర్ పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై లింగం వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన ఖాజీపల్లి నర్సింహులు భార్య పద్మ (37) గత నెల 20న తన తల్లిగారి ఊరు రుస్తుంపేటకు వెళ్లొస్తానని చెప్పి బయలు దేరింది. తిరిగి ఇంటికి రాలేదు. బంధువులతోపాటు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ తెలియలేదు. దీంతో భర్త ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

శివ్వంపేట(నర్సాపూర్): విద్యుదాఘాతంతో పాడి గేదె మృత్యువాత పడింది.ఈ ఘటన మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు శంకర్‌గౌడ్ పాడి గేదెలతో ఉపాధి పొందుతున్నాడు. రోజువారీగానే గేదెలను మేత కోసం వ్యవసాయ పొలం వద్దకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో విద్యుత్ స్తంభం సపోర్టు వైరుకు పాడి గేదె తగలడంతో షాక్ కొట్టింది. దీంతో పాడి గేదే మృతి చెందింది. రూ. 60 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

పెద్దశంకరంపేట మండలంలో నెమలి..



విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన నెమలి

పెద్దశంకరంపేట(మెదక్): విద్యుదాఘాతంతో నెమలి మృతిచెందింది. ఈ ఘటన మండల కేంద్రంలోని ప్రియాంక కాలనీలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. జనావాసాల్లోకి వచ్చిన నెమలి ప్రమాదవశాత్తు ఎగురుతూ విద్యుత్ వైర్లకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి వచ్చి నెమలిని తీసుకెళ్లారు.

13 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్ చెరు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ వివరాల ప్రకారం... ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందిని పట్టుకున్నారు. సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా 10 మందికి రూ.వెయ్యి, ముగ్గురికి రూ.1500 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

అదను దాటుతోంది

ఆశించిన స్థాయిలో కురవని వర్షం

- గడువు దాటి విత్తితే దిగుబడిపై ప్రభావం
- వానలొస్తే జూలై 15 వరకు విత్తవచ్చు
- ఆగస్టు 15వరకు వరి నాట్లు పూర్తి చేయాలి
- వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు



పల్లవి, వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త

దుబ్బాకటౌన్: రైతులు ఆశించిన దిగుబడులు సాధించాలంటే సాగులో విత్తనాలు విత్తే సమయం అత్యంత కీలకమని ఏరువాక వ్యవసాయ పరిశోధన సంస్థ తోర్నాల శాస్త్రవేత్త పల్లవి సూచిస్తున్నారు. వానాకాలం సీజన్ ఆరంభంలోనే వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు పొలం బాట పడుతున్నారు. ఇప్పటికే దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నారు. మరికొందరు వరి నారు పోసేందుకు సిద్ధమవుతున్నారు. సాగులో అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలు, చేపట్టాల్సిన విధి విధానాలను ఆమె వివరించారు. పత్తి, వరి, పప్పుధాన్యాలు, కంది, మొక్కజొన్న పంటలపై రైతులకు పలు సూచనలు చేశారు. పత్తి యాంత్రిక సాగుపై సైతం వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. వాతావరణ కేంద్రం అధికారుల అంచనా ప్రకారం ఈ సారి సాధారణ వర్ష పాతమే నమోదయ్యే అవకాశం ఉంది. కావున రైతులందరూ పరిస్థితులకనుగుణంగా పంటలు ఎంపిక చేసుకోవాలి. భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు చేపడితే మంచి ఫలితాలు సాధించవచ్చని చెబుతున్నారు.

వరి: సాగు చేసే రైతులు దీర్ఘకాల రకాలను ఈ నెల 25 వరకు వరి నారు పోసుకోవాలి. మధ్య కాలిక రకాలు అయితే జూలై 10 వరకు నారు పోసుకోవచ్చు. జూలై 31వరకు స్వల్ప కాలిక రకాల నార్లు పోసేందుకు సమయం ఉంది. ఆగస్టు 15 వరకు అన్ని రకాల వరి నాట్లను పూర్తి చేయాలి. నార్లు పోసే సమయంలో విత్తనాలను తప్పకుండా శుద్ధి చేయాలి.



గుడికందులలో పత్తి గింజలు విత్తుతున్న రైతులు

పత్తి:

అనుకున్నట్లు వర్షాలు కురిస్తే జూలై 15 వరకు పత్తి విత్తనాలను విత్తుకోవచ్చు. విత్తడంలో ఆలస్యం చేస్తే దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంది. పంట మార్పిడి విధానం పాటించాలి. పెసర, అంతర పంటలుగా వేసుకుంటే మంచిది. ప్రభుత్వం అనుమతిచ్చిన సుమారు 20 సంస్థలకు చెందిన బీటీ-2 పత్తి విత్తనాలను మాత్రమే విత్తుకోవాలి. ఎకరానికి సాగు చేసే భూమిని బట్టి 8 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. పంటను డిసెంబర్ వరకు తీసివేయాలి. రెండవ పంటగా మొక్కజొన్న, పెసర, కూరగాయలు, పొద్దు తిరుగుడు వేసుకుంటే మేలు. పత్తి విత్తనాలను విత్తిన రెండు రోజుల తర్వాత పెండిమిథిలిన్ 38.5 శాతం 700 మి.లీ. ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేయడం వల్ల కలుపును నివారించవచ్చు.

దొడ్డు రకాలు: కూనరం సన్నాలు, బతుకమ్మ, కాటన్ దొర సన్నాల రకాల పంట కాలం 120 రోజులు కాగా ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. తెలంగాణ సోన , కేఎన్‌ఎం-1638 పంట కాలం 125 నుంచి 130 రోజులు కాగా, ఎకరానికి 28 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

దీర్ఘకాలిక సన్న రకాలు: సాంబమసూరి పంట కాలం 150 రోజులు, ఎకరాకు 28క్వింటాళ్లు, జైశ్రీరాం రకం పంట కాలం 145 నుంచి 150 రోజులు, ఎకరానికి 24 క్వింటాళ్ల దిగుబడి పొందే అవకాశం ఉంటుంది.

కంది: కంది, మినుము, పెసర పంటలను జూలై 15 వరకు విత్తుకోవాలి. పత్తి, మొక్కజొన్న పంటల్లో కందిని అంతర పంటగా వేసుకోవచ్చు. డబ్ల్యూఆర్‌జీ-93 కంది రకం పంట కాలం 155 నుంచి 165 రోజులు కాగా ఎకరానికి 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి పొందవచ్చు. డబ్ల్యూఆర్‌జీ-97 కంది రకం పంట కాలం 150 నుంచి 160 రోజులు కాగా ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. డబ్ల్యూఆర్‌జీ -255, టీడీఆర్జీ-59 ఈ రెండు రకాలకు 180 రోజులు పంట కాలం కాగా ఎండు తెగులు తట్టుకుని 8 నుంచి 10 క్విటాళ్ల దిగుబడి వస్తుంది.

మొక్కజొన్న: జూలై 15 వరకు మొక్కజొన్న సాగు చేసుకోవచ్చు. మార్కెట్లో లభించే హైబ్రిడ్ రకాల్లో సాగు భూమికి అనుకూలమైనవి ఎంపిక చేసుకోవాలి. మొక్కజొన్నను ఒక పంటగా కాకుండా కందితో కలిపి అంతర పంటగా వేసుకుంటే మంచిది.

బావిలో పడి రైతు మృతి



రాజయ్య (ఫైల్)

నంగునూరు(సిద్దిపేట): వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లిన రైతు బావిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం నాగరాజుపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ముక్కెర రాజయ్య(50) వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు. ఆయన ఆచూకీ కోసం వెతకగా సొంత వ్యవసాయ బావిలో చెప్పులు కనిపించాయి. ఘటనా స్థలానికి ఎస్ఐ ఆసీఫ్ చేరుకొని ఫైర్ సిబ్బందిని పిలిపించారు. రెండు గంటల పాటు శ్రమించి మృతదేహాన్ని బయటకు తీశారు.



మృతదేహాన్ని బయటకు తీస్తున్న ఫైర్ సిబ్బంది

పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్.. యువకుడు మృతి

పటాన్‌చెరు టౌన్: బైక్‌ను టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ దుర్గయ్య వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజీవార్(25) బతుకుదెరువు కోసం జిన్నారం మండలం.. మాదారం గ్రామానికి వచ్చి, ఇల్లు అద్దెకు తీసుకొని స్క్రాప్ షాప్‌లో పని చేస్తున్నాడు. సోమవారం బైక్‌పై ఇస్నాపూర్ వెళ్లేందుకు సుల్తాన్‌పూర్ మీదుగా వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో కిష్టారెడ్డిపేట సర్వీస్ రోడ్డులో వెనుక నుంచి బైకును టిప్పర్ ఢీకొట్టింది. రాజ్‌వార్‌పై నుంచి వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టిన కారు

ప్రమాదంలో ఇద్దరు మృతి

దుబ్బాకరూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని తిమ్మాపూర్ వద్ద జరిగింది. ఎస్ఐ గంగరాజ్ తెలిపిన వివరాల ప్రకారం... అక్బర్‌పేట భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి గ్రామానికి చెందిన పల్లె అనిల్(27), అతని మిత్రుడు ఉచ్చురి పాపయ్య(30) ఈనెల15న రాత్రి పది గంటల సమయంలో సిద్దిపేటకు వెళ్తున్నారు. ఈ క్రమంలో సిద్దిపేట వైపు నుంచి రామాయంపేట వైపు వెళ్తున్న (స్విఫ్ట్ డిజైర్)కారు అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు అనిల్‌ను పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పాపయ్యను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కాగా పాపయ్య స్వగ్రామం ఏపీలోని ఒంగోలు జిల్లా, వేమవరం గ్రామం. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కారును అజాగ్రత్తగా నడిపిన డ్రైవర్ సంతోష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



అనిల్ (ఫైల్)

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

మునిపల్లి(అందోల్): ప్రభుత్వ ఉద్యోగి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కింది. బుదేరా గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి రూ.8 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు సోమవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ మెదక్ రేంజ్ డీఎస్పీ సుదర్శన్ వివరాల ప్రకారం... కోహిర్ మండలానికి చెందిన ఓ వ్యక్తి మునిపల్లి మండలం బుదేరా చౌరస్తాలో వాటర్ సర్వీసింగ్ సెంటర్, ఓపెన్ ప్లాట్‌కు కొత్త ఇంటి నంబర్ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నాడు. దీనికి పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి రూ.8వేల లంచం డిమాండ్ చేసింది. బాధితుడు ఆమె అడిగినంత ఇస్తానని ఒప్పందం చేసుకుని నేరుగా ఏసీబీ అధికారులను సంప్రదించాడు. పంచాయతీ కార్యదర్శి డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. భద్రత కారణాల వల్ల ఫిర్యాదు దారుడి వివరాలను గోప్యంగా ఉంచుతున్నామని తెలిపారు. నాగలక్ష్మిని అరెస్టు చేసి హైదరాబాద్‌లోని నాంపల్లి స్పెషల్ ఏసీబీ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే పంచాయతీ కార్యదర్శిగా మునిపల్లి మండంలో 18 సంవత్సరాలుగా ఆమె విధులు నిర్వహిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. మండల స్థాయి అధికారులు బదిలీపై ఇతర చోట్లకు వెళ్లారు. కానీ ఆ కార్యదర్శి మాత్రం మునిపల్లి మండలంలోనే విధులు నిర్వహించడం గమనార్హం. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే తమను సంప్రదించాలని ఏసీబీ డీఎస్పీ పేర్కొన్నారు. ఏసీబీ ఎస్ఐలు రమేశ్, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య

మేడారంలో ఘటన

ఎస్ఎస్ తాడ్వాయి: అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ రెడ్డి కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా ముస్తాబాద్‌కు చెందిన పిల్లి సత్యం (50), జ్యోతి దంపతులు 12 సంవత్సరాల నుంచి మేడారంలో గాజుల దుకాణం నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో సత్యం వ్యాపారం కోసం రూ. 10 లక్షల అప్పు చేశాడు. వ్యాపారం సరిగా నడవకపోవడంతోపాటు అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో అప్పు ఎలా తీర్చాలని కొంతకాలంగా మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం దుకాణం వెనుక రేకుల షెడ్డులో ఉరేసుకున్నాడు. ఈ ఘటనపై మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా మృతుడి కుమారులు పవన్, అఖిల్ జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లారు.

నేరాలు జరుగకుండా పటిష్ట చర్యలు

ఎస్పీ పరితోశ్ పంకజ్

కల్హేర్(నారాయణఖేడ్): నేరాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ పరితోశ్ పంకజ్ సూచించారు. సోమవారం రాత్రి కల్హేర్, సిర్గాపూర్‌లో పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. పోలీసుల పనితీరు, శాంతి భద్రతలు, పెండింగ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్టేషన్ల పరిసరాలు పరిశీలించారు. పోలీసుల పనితీరు బాగుందని కితాబిచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సైలు వెంకట్‌రెడ్డి, వెంకటేశం పాల్గొన్నారు.



కల్హేర్‌లో పోలీస్‌స్టేషన్ తనిఖీ చేస్తున్న ఎస్పీ పరితోశ్ పంకజ్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చోరీ



వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ రంజిత్‌రెడ్డి

గ్యాస్ సిలిండర్, మోటార్ అపహరణ

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చోరీ జరిగింది. కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి కథనం ప్రకారం... శుక్రవారం సాయంత్రం రోజు మాదిరిగా కళాశాల సమయం ముగియగానే తాళాలు వేశారు. శని, ఆదివారం సెలవు కావడంతో సోమవారం యథావిధిగా కళాశాలకు రాగా.. ఆఫీస్‌రూం, స్టాఫ్‌రూం, వాటర్ ప్లాంట్ గది తాళాలు ధ్వంసమై ఉన్నాయి. చోరీకి పాల్పడ్డ దొంగలు కెమిస్ట్రీ ల్యాబ్‌కు సంబంధించిన రెండు గ్యాస్ సిలిండర్లు, వాటర్ ప్లాంట్ గదిలో నుంచి వన్‌హెచ్‌పీ మోటార్ తీసుకొచ్చి బయటపెట్టాడు. ఒక గ్యాస్ సిలిండర్, మోటార్‌ను చోరీ చేశారు. మరో సిలిండర్ గోడ పక్కన పెట్టగా, ఆఫీస్‌రూంలోని రెండు కంప్యూటర్లు, మానిటర్, మౌస్, కీబోర్డు, సీసీ కెమెరాను బ్యాగ్‌లో పెట్టుకుని వరండాలోనే వదిలేసి వెళ్లాడు. సీసీ కెమెరాలు శనివారం మధ్యాహ్నం వరకు పనిచేశాయని, ఆ తరువాత పనిచేయలేదని ప్రిన్సిపాల్ చెప్పారు. క్లూస్‌టీం అధికారులు చోరీకి సంబంధించి ఆధారాలు సేకరించారు. పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

ఇప్పటివరకు 236 దరఖాస్తుల స్వీకరణ

కంది(సంగారెడ్డి): కంది మండలంలో రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. భూభారతి చట్టంపై అవగాహనలో భాగంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో భూములకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మండలంలో ఈనెల 6నుంచి రెవెన్యూ సదస్సులను రోజుకో గ్రామం చొప్పున నిర్వహిస్తున్నారు. పట్టామార్పిడి, సర్వే నంబర్ మిస్సింగ్, పౌతి, పాస్ పుస్తకాలు లేక పోవడం, సాదా బైనామా ద్వారా భూముల కొనుగోలు, భూసర్వే వంటి సమస్యలపై రైతుల నుంచి రెవెన్యూ అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మండలంలో ఇప్పటివరకు 20 రెవెన్యూ సదస్సులు నిర్వహించగా అందులో 236 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రవి కుమార్ తెలిపారు.



కందిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

మురుగు కాలువల నిర్మాణానికి కృషి



వార్డు సమస్యలు తెలుసుకుంటున్న కరుణాకర్

సంగారెడ్డి: సంగారెడ్డి పట్టణంలోని 30వ వార్డు సాయికృషినగర్‌లో మురుగు కాలువల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ఈ విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు చంద్రిక కరుణాకర్ మురుగు కాల్వల నిర్మాణానికి ఆర్థికసాయం చేస్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా కాలనీలో సోమవారం పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు.

డ్రగ్స్ మహమ్మారిని తరిమేద్దాం

- నిర్మూలనే లక్ష్యంగా జేఏసీ ఆధ్వర్యంలో పోరు యాత్ర
- పల్లెలకు విస్తరిస్తున్న మాదక ద్రవ్యాలు
- పేద కుటుంబాలు విచ్ఛిన్నం
- నియోజకవర్గంలో అవగాహన సమావేశాలు

హుస్నాబాద్: డ్రగ్స్‌ను తరిమికొడుదాం.. చక్కగా చదువుకుందాం..జ్ఞానాన్ని పెంచుకుందామనే నినాదంతో హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్రకు నడుం బిగించింది. పల్లెల్లో విస్తరిస్తున్న డ్రగ్స్‌ను తరిమిమేయాలనే సంకల్పంతో గ్రామ గ్రామాన ర్యాలీలు, అవగాహన సదస్సులతో ప్రజలను చైతన్యపరుస్తున్నారు. డ్రగ్స్ వల్ల జరిగే అనర్థాల గూర్చి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఏప్రిల్ 21న నియోజకవర్గంలోని భీమదేవరపల్లి మాణిక్యాపూర్ నుంచి ప్రారంభించారు. ఇప్పటి వరకు భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, అక్కన్నపేట, కోహెడ, చిగురుమామడి మండలాల్లో అవగాహన సమావేశాలు నిర్వహించారు.



మల్లంపల్లిలో అవగాహన కల్పిస్తున్న జేఏసీ నాయకులు

యువతను చైతన్య పరుస్తూ..

ఈ పోరు యాత్రలో ప్రజా, మహిళ, విద్యార్థి సంఘాలు, విశ్రాంత ఉద్యోగులు, విద్యావంతులు, సామాజిక వేత్తలను భాగస్వాములను చేస్తూ యువతను చైతన్యపరుస్తున్నారు. నగరాలు, పట్టణాలకే పరిమితమైన డ్రగ్స్ మహమ్మారి పల్లెలకు పాకింది. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు, నిఘా వ్యవస్థలు సైతం డ్రగ్స్‌ను అరికట్టేందుకు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతే టార్గెట్‌గా మత్తు పదార్థాలు విచ్చలవిడిగా సరఫరా చేస్తున్నారు. చదువుకోవాల్సిన వయస్సులో యువత వాటికి బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మత్తులో విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడుతున్నారు.

వెలుగులోకి వస్తున్న ఘటనలు..

- ధర్మరాజు పల్లెలో ఓ యువకుడు బెట్టింగ్‌లో దాదాపు రూ.5కోట్లు నష్టపోయి, అంతా అయిపోయాక కూలీ పనులు చేసుకుంటున్న ఘటన వెలుగులోకి వచ్చింది.
- శనిగరంలో మొబైల్ కొనివ్వకపోతే తన కొడుకు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తున్నాడని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది.
- ఓ గ్రామంలో ఇంటర్మీడియెట్ స్థాయికి మించి చదువుకున్న వారు లేరని, బెట్టింగ్‌లో పాల్గొంటూ మగవారి కంటే మహిళలే ఎక్కువగా డ్రగ్స్ వాడుతున్నారని జేఏసీ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు.
- మైసంపల్లి గ్రామంలో బెట్టింగ్ ఆడి తీవ్రంగా నష్టపోయి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.



డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీపీ సదానందం(ఫైల్)

అవగాహన కార్యక్రమాలు

గ్రామాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి సహకారంతో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్నారు. యువతను కాపాడుకోవాలని, ఎవరితో మాట్లాడుతున్నారు? ఏం చేస్తున్నారు? కనిపెట్టాలని తల్లిదండ్రులకు వక్తలు సూచిస్తున్నారు. మెదడుపై ప్రభావితం చూపే డ్రగ్స్ వినియోగం వల్ల విచక్షణ రహితంగా హత్యలు, ఆత్మహత్యలకు పాల్పడతారని తెలియజేస్తున్నారు. డ్రగ్స్‌కు, బెట్టింగ్‌లకు యువతను దూరంగా ఉంచి చదువుకు దగ్గర చేయాలని కోరుతున్నారు.

సమష్టిగా ఉద్యమిస్తే అరికట్టవచ్చు



గ్రామాల్లో డ్రగ్స్ విచ్చలవిడిగా సరఫరా అవుతోంది. డ్రగ్స్ ఎవరు వాడుతున్నారో, ఎక్కడి నుంచి వస్తోందో తెలిసిన మహిళలు చెప్పేందుకు భయపడుతున్నారు. సారా నిర్మూలనకు మహిళలు పోరాటం చేసినట్లుగా, డ్రగ్స్ నిర్మూలనకు అదే స్థాయిలో ఉద్యమిస్తే తప్ప అరికట్టలేం. ప్రభుత్వం, పోలీసులు, మహిళలు, ప్రజలందరు సమష్టిగా ఉద్యమిస్తే డ్రగ్స్ నిర్మూలనను పూర్తిగా నిర్మూలించవచ్చు. ఈ నెలాఖరులోగా పోరు యాత్ర సభను నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తాం.

– మేకల వీరన్న యాదవ్, డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్ర నియోజకవర్గ కో ఆర్డినేటర్, హుస్నాబాద్